క్లుప్తంగా


రేపు పాలిసెట్

పలమనేరు: పట్టణంలో బుధవారం నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక పాలిసెట్ కో–ఆర్డినేటర్ మహమూద్ సూచించారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఆయన పట్టణంలోని ఐదు కేంద్రాల అధికారులతో సమీక్షించారు. రేపటి పరీక్షకు రెండు వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సెంటర్ల వద్ద మంచినీరు, ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా చూడాలని తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తిపై సమీక్ష

రొంపిచెర్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ శాఖతో సమీక్ష నిర్వహించారు. మండలానికి రెండవ విడతలో సుమారు 2 వేల ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. వీరిలో కొందరికి ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకుని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలన్నారు. అలాగే సొంత స్థలాలు ఉన్న వారు ఇంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులు పూర్తి చేసిన పనులకు వెంటనే బిల్లులు చేయాలని హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. అలాగే కాలనీల్లో మౌలిక వసతులను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, మంత్రి పీఏ మునితుకారం, ఎంపీడీఓ రాజేంద్ర, తహసీల్దార్ అమరనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన వేరుశనగ కాయలు


మతుకువారిపల్లె ఆర్‌బీకేలో దించుతున్న వేరుశనగ విత్తనాలు

పులిచెర్ల(కల్లూరు): ఖరీఫ్ సీజన్‌లో ఏటా సాగయ్యే వేరుశనగ పంటకు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీపై వేరుశనగ విత్తనకాయలను రైతులకు అందించడానికి రంగం సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి మండలానికి 1095 క్వింటాళ్ల విత్తనకాయలు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. దీంతో సోమవారం 231 క్వింటాళ్ల విత్తనకాయలు వచ్చాయని ఏఓ హరిప్రసాద్ తెలిపారు. వేరుశనగ కాయలు పూర్తిస్థాయిలో వచ్చిన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

కాగితపు బొమ్మలతో పిల్లలకు శిక్షణ


పిల్లలకు కాగితపు బొమ్మలతో శిక్షణనిస్తున్న గజేంద్ర

పలమనేరు: పట్టణ సమీపంలోని గంగవరం కళామందిరంలో నైతిక విలువలపై పిల్లలకు శిక్షణ అందిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు గజేంద్ర కాగితపు బొమ్మల ద్వారా పిల్లలకు వ్యక్తిత్వ వికాసం, మానవ విలువలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇలాంటి ప్రత్యేక బోధన ద్వారా శిక్షణనిస్తే పిల్లల మెదడులో ఎన్నటికీ నిలిచి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్సు


తపస్సుమాను ఎక్కుతున్న అర్జున వేషధారి

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని కొత్తపల్లిలో జరుగుతున్న మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. అర్జున వేషధారి మానుపై నుంచి విసిరిన విబూధి, నిమ్మ పండ్ల కోసం భక్తులు ఎగబడ్డారు. మహిళలు సంతానం కోసం తడిదుస్తులతో తపస్సు మాను చుట్టూ వరపడ్డారు. వేకువజామున అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ద్రౌపదీదేవీ ఉత్సవమూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను గ్రామవీధులలో ఊరేగించారు.


మంచి ఫలితాలను సాధించిన పలమనేరు బాలికోన్నత పాఠశాల


జిల్లాలో టాప్‌లో నిలిచిన బైరెడ్డిపల్లి మోడల్ స్కూల్

సత్తా చాటిన సర్కారు బడులు

- జిల్లాలో టాప్ లేపిన గురుకుల, మోడల్ స్కూల్
- నాణ్యమైన భోదనతోనే మంచి ఫలితాలు

పలమనేరు: మొన్న వెలువడిన పది పరీక్ష ఫలితాల్లో పలమనేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటాయి. ప్రైవేటుకు దీటుగా ఫలితాలను సాధించాయి. నాడు–నేడు ద్వారా ప్రభుత్వం పాఠశాల భవనాలను అభివృద్ధి చేసింది. అన్ని రకాల వసతులు సమకూర్చింది. జగనన్న విద్యా కానుక ద్వారా పిల్లలకు అవసరమైన యూనిఫాం, పుస్తకాలు, బూట్లు తదితరాలను అందించింది. ఉత్తమ విద్యాభోదన, మెరుగుపడిన సౌకర్యాలతో పిల్లలు మంచి ఫలితాలను సాధించి కార్పొరేట్‌కు దీటైన సమాధానమిచ్చారు.

ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఎస్‌కు 93 శాతం

పలమనేరు మండలంలో ఎనిమిది ఉన్నత పాఠశాలలు, ఓ సాంఘిక సంక్షేమ పాఠశాలలున్నాయి. ఇందులో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ 93.42% సాధించి జిల్లాలోనే సాంఘిక సంక్షేమ పాఠశాలలో అగ్రస్థానం దక్కించుకుంది. ఇదే మండలంలోని మండిపేటకోటూరు, బాలికోన్నత పాఠశాల, నక్కపల్లి, దొడ్డిపల్లి, కొలమాసనపల్లి పాఠశాలల సైతం ఈ దఫా 70కిపైగా శాతం ఉత్తీర్ణతను సాధించాయి. 40 మంది 500కంటే పైగా మార్కులను సాధించారు.

మోడల్ స్కూల్‌కు 90 శాతం

బైరెడ్డిపల్లి మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ 90.28%తో జిల్లాలోనే తొలిస్థానంలో నిలిచింది. ఇదే మండలంలోని ఏపీఆర్‌ఎస్ (గురుకుల) పాఠశాల 98.77% ఉత్తీర్ణత సాధించింది. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ స్కూల్ 94.44%తో సత్తా చాటింది. గంగవరం మండలంలో మొత్తం 16 స్కూళ్ళుండగా వీటిల్లో మేలుమాయి 92%తో టాప్‌లో నిలిచింది. పెద్దపంజాణి మండలంలో మొత్తం 14 ఉన్నత పాఠశాలలుండగా రాజుపల్లి 92 శాతంతో మండలంలో తొలిస్థానం సాధించింది. వి.కోట మండలంలో 35 హైస్కూళ్లుండగా కొంగాటం స్కూల్ 92% ఉత్తీర్ణత సాధించి మొదటి స్థానంలో నిలిచింది.

నియోజకవర్గంలో టెన్త్ ఫలితాలు

మండలం	విద్యార్థులు	ఉత్తీర్ణులైనవారు	ఉత్తీర్ణత శాతం
పలమనేరు	728	507	79.02
పెద్దపంజాణి	667	433	64.72
బైరెడ్డిపల్లి	706	508	71.95
గంగవరం	573	390	62.63
వీకోట	1121	659	58.79

సేంద్రియ ఎరువులతోనే ఆరోగ్యం

బైరెడ్డిపల్లి: రైతులు సేంద్రియ ఎరువులను వినియోగిస్తే, ప్రజలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించవచ్చని ఏపీఎం లలిత పేర్కొన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఎఫ్‌పీవో సంఘాలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అధునాతన పద్ధతులతో సాగు చేస్తే అధిక దిగుబడితో పాటు లాభాలు ఎక్కువగా వస్తాయన్నారు. రసాయనిక ఎరువులతో కలిగే అనర్థాలు అవగాహన కల్పించారు. సీసీ లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి


ఏనుగులు నాశనం చేసిన చెరుకు తోట

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాతపేటలో ఆదివారం రాత్రి పంటపొలాలపై ఏనుగులు దాడి చేసి పంటలను ధ్వంసం చేశాయి. ముఖ్యంగా చెరుకు, టమాటా, మామిడి పంటలను ఎక్కువగా నష్టపరిచాయని గ్రామస్తులు తెలిపారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

కుప్పం: గంథాలయ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌పేట పాఠశాలలో చేపట్టిన వేసవి శిక్షణ తరగతులను కుప్పం మున్సిపల్ చైర్మన్ సుధీర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కవితలు, యోగా తదితరాలపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. గ్రంథాలయ అధికారి వాణి మాట్లాడుతూ 8 తరగతి లోపు పిల్లలు ఈ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

శాంతిపురం: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ సుభాషిణి తెలిపారు. సోమవారం నుంచి జూన్ నెల 11వ తేదీ రకూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. పిల్లలకు కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు నేర్పుతామని చెప్పారు. కథలు వినటం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, అముద్రిత కథలు, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్ తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు స్థానిక గ్రంథాలయంలో సంప్రదించాలని కోరారు.

వేసవి శిక్షణ శిబిరంప్రారంభం

గంగవరం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్, క్యారమ్స్, డాన్స్, చెస్, నాటికలు, బుక్‌రీడింగ్, పుస్తక సమీక్ష, మ్యూజికల్ చైర్స్, యోగా తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జూన్ 6వ తేదీ వరకూ ఈ శిక్షణ ఉంటుందని పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ


తిరుమలకు బయల్దేరిన కూరగాయల లారీతో నాయకులు

శాంతిపురం: తిరుమల శ్రీవారి నిత్యాన్నదానంలో వినియోగించేందుకు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు సోమవారం 10 టన్నుల కూరగాయలను పంపారు. కూరగాయలు నింపిన లారీకి పూజలు చేసి టీటీడీత వాహనాన్ని సాగనంపారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, నాయకులు చక్రపాణిరెడ్డి, సుబ్బరాజులు, నిసార్, రామకృష్ణారెడ్డి, మురుగేష్, కృష్ణ, ఎంపీటీసీలు బాబురెడ్డి, రవి, రమేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప సేవలో జెడ్పీ చైర్మన్



సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం సందర్శించారు. అయ్యప్పమాల దీక్షలో ఉన్న ఆయన వీ.కోట మండలం పత్రపల్లెలోని ఆయన స్వగృహంలో ఇరుముడి కట్టుకుని వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఇరుముడి సమర్పించి అనంతరం ఆయన మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో రాయలపేట చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అశ్వవాహనంపై శ్రీవారి చిద్విలాసం



సదుం: మండలంలోని బూరగమందలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి అశ్వవాహనంపై నుంచి భక్తులను కటాక్షించారు. స్వామివారం ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఉదయం స్వామి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారిని అశ్వవాహనంపై వైభవంగా ఊరేగించారు. కార్యక్రమానికి మలయ్య కుటుంబ సభ్యులు ఉభయదారులుగా ఉన్నారు.

పాలారు పరవళ్లు


ప్రవహిస్తున్న పాలారు చెక్‌డ్యామ్

శాంతిపురం: పాలారు నది ప్రవాహం సోమవారం మళ్లీ మొదలైంది. మార్చి నెలారంభంలో ప్రవాహం ఆగింది. ప్రస్తుతం స్థానికంగా వర్షాలు నామమాత్రంగానే కురిసినా ఎగువన ఉన్న కర్ణాటక ప్రాంతంలో విరివిగా కురవడంతో పాలారు నదిలోకి నీరు ఎక్కువగా వస్తోంది. సోమవారం శాంతిపురం వద్ద పాలారు నదిపై ఉన్న చెక్ డ్యామ్ నిండి దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తోంది. ఎనిమిదేళ్లకు ఓ సారి మాత్రమే ప్రవహిస్తుందని పేరున్న పాలారు నది మూడేళ్ల నుంచి తరచూ పరవళ్లు తొక్కుతోంది.

క్రికెట్ ప్రీమియర్ లీగ్‌కు 8 జట్లు

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో రెండవ రోజు సోమవారం జరిగిన క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో 8 జట్లు అర్హత సాధించినట్టు కరెస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. మొదటి రోజు మొత్తం 32గా ఉన్న జట్లు 2వ రోజుకి 16 ఆ తరువాత నేటి ఆఖరి రోజుకి 8కి చేరుకున్నాయి. నేటి ఫైనల్స్‌లో ఈ జట్లు పాల్గొంటాయని చెప్పారు. విజేత జట్టుకు మొదటి బహుమతి కింద రూ. 20 వేలు, 2వ బహుమతిగా రూ.15 వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

నగరి: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నగరి జూనియర్ సివిల్‌జడ్జి వి.గోపాలకృష్ణ సోమవారంఒక ప్రకటనలో తెలిపారు. మే నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. పలు రకాల కేసులను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. రాజీ పడడంతో ఇరువురు గెలిచినట్లే అని లోక్ అదాలత్ ద్వారా ఇరువురికి సమాన న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇందులో చిన్నచిన్న తగాదాలతో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్ ద్వారా రాజీపడే అవకాశం ఉందన్నారు. కోర్టు కేసులు, భూములకు సంబంధించి, క్రిమినల్ కేసులు, కుటుంబం పలు రకాల కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు.

నవరత్నాలతోనే రాష్ట్రాభివృద్ధి


అభివృద్ధి, పథకాలకు సంబంధించి కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

- చిత్తూరు ఎమ్మెల్సీ భరత్

కుప్పం రూరల్: నవరత్నాలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. ఆయన సోమవారం కుప్పం మండలం మహ్మద్‌పురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని 290 ఇళ్లకు వెళ్లి మూడేళ్ల పాలనలో జగనన్న ప్రభుత్వం అందించిన పథకాలు, వారి పొందిన లబ్ధిని వివరించారు. మురుగు కాలువలు, ఇళ్లు, పింఛన్లు, అమ్మ ఒడి తదితర సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరాలోచనతో నవరత్నాల పథకాలు తీసుకువచ్చారని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి నవరత్నాలతోనే సాధ్యమన్నారు. మహ్మద్‌పురం గ్రామం ఆనుకుని పాలారు వద్ద ప్రాజెక్టు నిర్మాణంకు దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి పూనుకుంటే చంద్రబాబు తమిళ ప్రభుత్వంతో కలిసి కోర్టుకెళ్లి అడ్డుకున్నారని చెప్పారు. ప్రాజెక్టును కట్టి తీరాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే కుప్పం మండలానికి తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతున్న ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ, నాయకులు నాసీర్, వెంకటరామయ్య, నాగభూషణం, చీలేపల్లి రవి, సోము, గణపతి తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పోరాడుదాం


నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

పలమనేరు: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గురురాజారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏపీ ఎన్జీవో కార్యాలయం ఎదుట సోమవారం వారు కాసేపు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం అన్ని జేఏసీలు ఓ తాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను రూ.5 లక్షలకు పెంచాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈకేవైసీని 40 శాతం మంది మాత్రమే ఆన్‌లైన్ చేశారని మిగిలిన వారు 60 శాతం ఉన్నందున అదనపు సమయాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘ నాయకులు క్రిష్ణమూర్తి, గౌస్, సుబ్రమణ్యం, గురుస్వామి, వీరభద్రగౌడు, వినాయకం తదితరులు పాల్గొన్నారు.

కుశస్థలి నదిలో పెరిగిన నీటి ప్రవాహం


కుశస్థలి నదిలో నీటి ప్రవాహంలో చిక్కుకున్న ట్రాక్టరు

నగరి: ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణాపురంలోని అమ్మపల్లి డ్యాం నిండి గేట్లు తెరవడంతో సోమవారం ఉదయం నుంచే కుశస్థలి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఇసుక, రాళ్లు, గడ్డితో కనిపించే నది నీటి ప్రవాహంతో కళకళలాడింది. తెరణి సమీపంలో ఇసుక కోసం వెళ్లిన ఓ ట్రాక్టర్ నీటిలో చిక్కుకుంది. నీటి ప్రవాహం తగ్గేంత వరకు వాహనాన్ని బయటకు తీసే వీలు లేని పరిస్థితి నెలకొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని నీటిలోనే వదిలి గట్టుకు చేరుకున్నారు.

పథకాల అమలులో రాష్ట్రం ముందంజ

- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: దేశానికే ఆదర్శవంతమైన పథకాలను అమలు చేస్తూ రాష్ట్రం ముందంజలో ఉందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మండలంలోని కుంభార్లపల్లి పంచాయతీలోని అనంతపురం, గెస్తింపల్లి, బాలేంద్రపల్లి, ముమ్మిడేర్లపల్లి, పిచ్చిగుండ్లపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. 574 గృహాలను సందర్శించి గడపగడపలో లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్లను అందిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఎమ్మెల్యేకి హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, సమస్యలేవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను అందించడం గర్వించదగ్గ విషయంగా కొనియాడారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ న్యాయం చేకూరుతోందన్నారు.


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి

డ్రైనేజీ , నీటి కొళాయిలు, విద్యుత్ లైన్ ఎత్తు పెంచాలని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించేలా ఆదేశించారు. ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్, పీఏసీఎస్ చైర్మన్‌లు శ్రీరాములురెడ్డి, గోపిరెడ్డి, సర్పంచ్ సుభాష్ ,ఎంపీటీసీ మురుగేష్, రెస్కో డైరెక్టర్ భూపతి, వైఎస్సార్‌సీపీ పంచాయతీ కన్వీనర్ అయ్యత్‌బాషా, నాయకులు పాల్గొన్నారు. నేడు కుంబార్లపల్లి పంచాయతీలో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ యువరాజ్ సోమవారం తెలిపారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

సోమల: తన భర్త అనుమానంతో వేధిస్తూ, కట్నం తేవాలని తనను హింసిస్తున్నాడని మహిళ సోమవారం ఫిర్యాదు చేసిందని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మారుతి తెలిపారు. ఆయన కథనం మేరకు, మండలంలోని నంజంపేట పంచాయతీ సరస్వతీపురానికి చెందిన హేమప్రియ కు సోమల భారతంమిట్టకు చెందిన వెంకటరమణతో గతంలో వివాహమైంది. అయితే ఇటీవల నుంచి అదనపు కట్నం తేవాలంటూ తన భర్త వెంకటరమణ వేధిస్తున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వెంకటరమణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.